క్లుప్తంగా

హెచ్ఐవీ రోగులకు పౌష్టికాహారం పంపిణీ



హెచ్ఐవీ రోగులకు పౌష్టికాహారం పంపిణీ చేస్తున్న సంస్థ ప్రతినిధులు

పాయకరావుపేట : ఆంధ్రప్రదేశ్ స్టేట్ ఎయిడ్స్ కంట్రోల్ సొసైటీ, జిల్లా ఎయిడ్స్ నియంత్రణ సంస్థ ఆదేశాల మేరకు చైల్డ్ ఫండ్ ఇండియా లింక్ వర్కర్స్ స్కీం ఆధ్వర్యంలో శ్రీ సరస్వతీ విద్యా సేవా సమితి సహకారంతో హెచ్ఐవీ వ్యాధిగ్రస్తులకు పౌష్టిక ఆహారం పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సేవాసమితి అధ్యక్షుడు గొర్ల రామకృష్ణ, కిషోర్‌రెడ్డి, లింక్ వర్కర్స్ స్కీం డిస్ట్రిక్ట్ రిసోర్స్ పర్సన్ ఎస్.గోవిందరావు, సూపర్‌వైజర్ డి.రమణ, లింక్ వర్కర్స్ పాల్గొన్నారు. 25 మందికి ఒక్కొక్కరికి రూ. 550 విలువ గల పౌష్టికాహారం పంపిణీ చేశారు.

ఇళ్ల నిర్మాణాలు వేగవంతం చేయండి

మునగపాక : జగనన్న ఇళ్ల నిర్మాణాలు వేగవంతమయ్యేలా చూడాలని ఎంపీడీవో పి.రవి కుమార్ కోరారు. బుధవారం స్థానిక మండల పరిషత్ హాలులో డిజిటల్ అసిస్టెంట్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో జగనన్న ఇళ్ల నిర్మాణాలు చురుగ్గా జరిగేలా ప్రోత్సహించాలన్నారు. అలాగే కాలనీల్లో మౌలిక సదుపాయాలపై దృష్టి సారించాలన్నారు. లబ్ధిదారులకు పదేపదే అవగాహన కల్పిస్తూ ప్రభుత్వం ఇచ్చే సాయాన్ని వినియోగించుకొని ఇళ్ల నిర్మాణాలు చేపట్టాల్సిందిగా వివరించాల్సిన అవసరం ఉందన్నారు. ఇన్‌చార్జి తహసీల్దార్ వినయ్, ఈవో ఆర్డీ ఈశ్వరరావు తదితరులు సమావేశంలో పాల్గొన్నారు.

నేడు షిర్డీసాయి విగ్రహ ప్రతిష్ట

మునగపాక : మండల కేంద్రంలో గురువారం శ్రీ షిర్డీసాయి బాబా విగ్రహ ప్రతిష్ట కార్యక్రమం జరగనుందని ఆలయ చైర్మన్ బొడ్డేడ వీరేంద్ర తెలిపారు. స్వర్గీయ పెంటకోట భాస్కరరావు-వెంకటరత్నంల కుమారుడు స్వర్గీయ అయోధ్య రాము జ్ఞాపకార్థ భార్య సుబ్బలక్ష్మి, కుమారుడు వినోద్‌కుమార్‌ల ఆర్థిక సహకారంతో విగ్రహాన్ని ఏర్పాటు చేయనున్నామన్నారు. అదేరోజు మధ్యాహ్నం 12గంటలకు ఆలయ ప్రాంగణంలో భారీ అన్న సమారాధన జరుగుతుందన్నారు. భక్తులు పెద్దసంఖ్యలో తరలివచ్చి విగ్రహ ప్రతిష్టలో పాల్గొని తీర్థ ప్రసాదాలు స్వీకరించాలని వీరేంద్ర కోరుతున్నారు.

47 మందికి ఉచిత కంటి శస్త్ర చికిత్సలు



కంటి శస్త్ర చికిత్సలు చేయించుకున్న రోగులు

అచ్యుతాపురం(అనకాపల్లి): బ్రాండెక్స్ ఆధ్వర్యంలో గత ఆదివారం నిర్వహించిన కంటి వైద్య శిబిరంలో శస్త్ర చికిత్స అవసరమని గుర్తించిన వారికి విజయవంతంగా శస్త్ర చికిత్సలు చేసి వారి ఇళ్లకు చేర్చారు. 47 మందికి విశాఖ కంటి ఆస్పత్రిలో శస్త్ర చికిత్సలు చేయించి బ్రాండెక్స్ వాహనాల్లో వారి ఇళ్లకు చేర్చారు.

వికాస పరీక్షల విజేతలకు బహుమతులు



బహుమతులు అందజేస్తున్న దృశ్యం

అచ్యుతాపురం(అనకాపల్లి): ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో కొద్ది రోజుల క్రితం నిర్వహించిన వికాస పరీక్షల్లో ప్రతిభ కనబరిచిన పది మందికి బుధవారం జడ్పీ హైస్కూలో బుధవారం బహుమతులు అందజేశారు. హెడ్‌కానిస్టేబుల్ కృష్ణ చేతుల మీదుగా బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో జన విజ్ఞాన వేదిక ప్రధాన కార్యదర్శి రామ్‌కుమార్, రమణ, సోమునాయుడు, గొర్లె తరుణ్ పాల్గొన్నారు.

ఆశాజనకంగా జీడిమామిడి కాపు

గొలుగొండ: మండలంలో జీడిమామిడి తోటల కాపు ఆశాజనకంగా ఉంది. వాతావరణం అనుకూలంగా ఉండడంతో ప్రస్తుతం చంద్రయ్యపాలెం, బుడ్డడపాడు, అమ్మపేట, కరక తదితర ప్రాంతాల్లో జీడి పిక్కల కాపు ప్రారంభమైంది. సుమారు నాలుగు వేల ఎకరాల్లో ఈ తోటలున్నాయి. వరి తరువాత రైతులు ఈ పంటపై ఆధారపడి జీవనం సాగిస్తున్నారు.

పరీక్షలకు నో 'టెన్'షన్

- ప్రతి రోజూ ప్రత్యేక తరగతుల నిర్వహణ
- చదువులో వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక దృష్టి
- 66 హైస్కూళ్లు...3194 మంది పరీక్షలకు సిద్ధం
- ఏప్రిల్ 3 నుంచి పదో తరగతి పరీక్షలు ప్రారంభం



తోటాడ హైస్కూల్లో నిర్వహిస్తున్న స్టడీ అవర్

మునగపాక : విద్యార్థి జీవితంలో పదో తరగతి ఎంతో కీలకం. పదో తరగతిలో సాధించే మార్కులే ఉన్నత చదువులకు తొలి మెట్టు. దీనిని దృష్టిలో ఉంచుకొని పదవతరగతి పరీక్షల్లో శతశాతం ఉత్తీర్ణత లక్ష్యంగా విద్యాశాఖ ప్రణాళికలు రూపొందించింది. ప్రభుత్వ, ప్రయివేటు పాఠశాలల ఉపాధ్యాయులు తమ పిల్లలు మెరుగైన ఫలితాలు సాధించేందుకు అవసరమయ్యే కసరత్తులు చేపట్టారు. ఉదయం, సాయంత్రం సమయాల్లో ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నారు. అలాగే చదువులో వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నారు.

పూర్తయిన సిలబస్..
ప్రతి రోజూ టాలెంట్ పరీక్షలు

ఇప్పటికే పదో తరగతికి సంబంధించి సిలబస్ అన్ని పాఠశాలల్లో పూర్తయింది. ప్రస్తుతం రివిజన్ జరుగుతుంది. ప్రతి రోజూ పిల్లలకు పరీక్షలు నిర్వహించి వారి సామర్థ్యం తెలుసుకుంటున్నారు. ఏఏ సబ్జెక్టులలో వెనుకబడి ఉన్నారో గమనించి వారికి మరింత శిక్షణ ఇస్తున్నారు. ఈ ఏడాది మండల వ్యాప్తంగా శతశాతం ఫలితాలే లక్ష్యంగా విద్యాశాఖ తగు చర్యలు చేపట్టింది. ప్రభుత్వం ఇప్పటికే 11 ప్రశ్నాపత్రాలు ఉండగా నేడు ఆ సంఖ్యను 7కు కుదించారు. ఏప్రిల్ 3 నుంచి పదో తరగతి పరీక్షలు నిర్వహించేందుకు ఇప్పటికే టైం టేబుల్ కూడా అందుబాటులోకి తీసుకువచ్చింది.

3194 మంది పరీక్షలకు సన్నద్ధం

నియోజకవర్గం వ్యాప్తంగా నాలుగు మండలాలకు సంబంధించి 66 హైస్కూల్స్ ఉన్నాయి. వాటిలో ఈ సంవత్సరం 3194 మంది విద్యార్థులు పదో తరగతి పరీక్షలు రాయనున్నారు. మునగపాక మండలంలో 11 స్కూల్క్ కాగా 604 మంది, అచ్యుతాపురం మండలంలోని 15 స్కూల్స్ కాగా 896 మంది, యలమంచిలిలో 20 స్కూల్స్‌కాగా 1037మంది, రాంబిల్లిలో 20 స్కూళ్లకు 657మంది విద్యార్థులు వెరసి 66 స్కూల్స్ కాగా 3194 మంది విద్యార్థులు తమ ప్రతిభను నిరూపించుకునేందుకు సిద్ధంగా ఉన్నారు.

విద్యార్థుల్లో పెరుగుతున్న ఆత్మ విశ్వాసం..

పదో తరగతి చదువుకుంటున్న విద్యార్థుల్లో ఆత్మ విశ్వాసం నింపేందుకు విద్యాశాఖ తగు చర్యలు చేపట్టింది. నిష్ణాతులైన ఉపాధ్యాయులతో ప్రతి రోజూ స్కూళ్లలో ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నారు. చదువులో వెనుకబడిన వారిని గుర్తించి మంచి ఫలితాలు సాధించే దిశగా శిక్షణ ఇప్పిస్తున్నారు. పాఠశాల సమయాల్లోనే కాకుండా ఉదయం, సాయంత్రం సమయాల్లో అదనంగా గంట పాటు చదివిస్తూ వారిని ప్రోత్సహిస్తున్నారు.

ప్రత్యేక తరగతులతో మేలు



ఉదయం, సాయంత్రం సమయాల్లో ప్రత్యేక తరగతులు నిర్వహించడం వల్ల మేలు జరుగుతుంది. ఈ సంవత్సరం మంచి ఫలితాలు సాధించేలా కష్టపడి చదువుతున్నా. ఉపాధ్యాయులు మరింత ప్రోత్సహిస్తున్నారు. ప్రధాన సబ్జెక్ట్‌లపై మరింత శిక్షణ ఇస్తున్నారు.

– మళ్ల సుచిత్ర, పదో తరగతి విద్యార్థిని, తోటాడ

గణితంపై భయం పోగొట్టేలా...



కొంతమంది విద్యార్థులకు గణితం అంటే భయంగా ఉండేది. వారిలో భయం పోగొట్టేందుకు అవగాహన కల్పిస్తూ ప్రోత్సహిస్తున్నాం. విద్యార్థులు ఆత్మ విశ్వాసంతో పరీక్షలు రాయాలి. పదేపదే తర్ఫీదు ఇవ్వడం ద్వారా మంచి ఫలితాలు సాధించే దిశగా చర్యలు తీసుకుంటున్నాం.

– కాండ్రేగుల సూర్యనారాయణ, హెచ్ఎం, మునగపాక

వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక దృష్టి



చదువులో వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నాం. ఈ ఏడాది మండల వ్యాప్తంగా మంచి ఫలితాలు వచ్చేలా కృషి చేస్తున్నాం. ఉపాధ్యాయులు కూడా కష్టపడి పని చేస్తున్నారు. పరీక్షల్లో మంచి మార్కులు తెచ్చుకునేలా విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్నాం.

– వేణు గోపాలరావు, ఎంఈవో

ఆంజనేయ స్వామికి ప్రత్యేక పూజలు



భక్తులకు దర్శనమిచ్చిన ఆంజనేయస్వామి

పాయకరావుపేట : పాల్తేరు గ్రామంలో అభయ ఆంజనేయ స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆంజనేయ స్వామి విగ్రహ ప్రతిష్ట జరిగి మూడేళ్లు పూర్తయిన సందర్భంగా 3వ వార్షికోత్సవ పూజా కార్యక్రమాలు గ్రామస్తులు ఘనంగా నిర్వహిస్తున్నారు.

ఈ సందర్భంగా ఘనంగా అన్నసమారాధన జరిపారు. స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకుడు దేవవరపు సూర్యచక్రం, పార్టీ మండల అధ్యక్షుడు ధనిశెట్టి బాబూరావు, ఏఎంసీ వైస్ చైర్మన్ గూటూరు శ్రీను, ఎంపీటీసీ ఇసరపు సత్యనారాయణ తదితరులు స్వామిని దర్శించుకున్నారు.



ఆంజనేయస్వామిని దర్శించుకున్న నాయకులు

అప్పన్నపాలెంలో...

రాంబిల్లి : అప్పన్నపాలెం గ్రామంలో బుధవారం ఆంజనేయస్వామి తీర్థ మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులు ఆంజనేయస్వామి వారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. మధ్యాహ్నం భారీ అన్నసమారాధన కార్యక్రమాన్ని నిర్వహించారు. భజనలు, కోలాటాలు, తప్పెటగుళ్లు నిర్వహించారు.

లోవాంబిక ఆలయం ప్రారంభోత్సవం నేడు



గోకివాడలో నిర్మించిన లోవాంబిక అమ్మవారి ఆలయం



లోవాంబిక అమ్మవారు

రాంబిల్లి : గోకివాడలో లోవాంబిక అమ్మవారి నూతన ఆలయ ప్రారంభోత్సవాన్ని గురువారం నిర్వహించనున్నారు. ఈ మేరకు ఏర్పాట్లు పూర్తి చేసారు. అమ్మవారి విగ్రహ ప్రతిష్టను శాస్త్రోక్తంగా నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా బుధవారం హోమం, ఇతర పూజాది కార్యక్రమాలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఆలయ ప్రారంభోత్సవం సందర్భంగా గురువారం భారీ అన్నసమారాధన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. పలు ఆధ్యాత్మిక కార్యక్రమాలను నిర్వహించనున్నారు.

నేడు మరిడిమాంబ జాతర





మరిడిమాంబ అమ్మవారు, అనకాపల్లి-చోడవరం రహదారిలో విద్యుత్ తోరణాలు

అనకాపల్లిటౌన్ : స్థానిక విజయరామరాజుపేట మరిడిమాంబ అమ్మవారి జాతర మహోత్సవం గురువారం అత్యంత వైభవంగా నిర్వహించేందుకు ఉత్సవ కమిటీ ఏర్పాట్లు చేసింది. ఆ రోజు ఉదయం అమ్మవారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు జరగనున్నాయి. అమ్మవారి ఆలయానికి పెద్ద ఎత్తున భక్తులు తరలి వచ్చే అవకాశాలుండటంతో ముందస్తు ఏర్పాట్లు చేసినట్టు ఉత్సవ కమిటీ ప్రతినిధులు తెలిపారు. తెల్లవారుజామున నగర సంకీర్తన, 9 గంటలకు భక్తిసుధ భక్తిగీతాలాపన, సాయంత్రం కనులు మిరుమిట్లు గొల్పే విద్యుత్‌కాంతుల నడుమ కోలాటాలు, పులివేషాలు, చిటికెల భజనలు తదితర కార్యక్రమాలు ప్రజల్ని ఆకట్టుకుంటాయన్నారు. రాత్రి 7 గంటల నుంచి ఆర్కెస్ట్రా, డ్యాన్స్ బేబీ డ్యాన్స్, డూప్స్ బాబోయ్ డూప్స్, సారంగధర చౌచౌ, కొండకొప్పాక వారిచే బాణసంచా విన్యాసాలు ఏర్పాటు చేసినట్టు నిర్వాహకులు తెలిపారు.

పార్టీలో కష్టపడిన వారికి తగిన గుర్తింపు



ఎమ్మెల్యే గొల్ల బాబూరావును సత్కరిస్తున్న సోషల్‌మీడియా సభ్యులు

ఎస్.రాయవరం : పార్టీలో కష్టపడిన వారికి తగిన గుర్తింపు ఉంటుందని పాయకరావుపేట నియోజవర్గ కన్వీనర్ కొంకిపూడి రామకృష్ణ అన్నారు. ఇటీవల ఎస్.రాయవరం మండలంలో సోషల్‌మీడియాలో నియమితులైన యువకులతో కొరుప్రోలు క్యాంపు కార్యాలయం వద్ద బుధవారం ఎమ్మెల్యే గొల్ల బాబూరావును సత్కరించారు. వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్‌కాంగ్రెస్ పార్టీ గెలుపునకు శక్తివంచన కృషి చేస్తామన్నారు. ఎమ్మెల్యేను సత్కరించిన వారిలో ఎస్.రాయవరం మండలం సోషల్ మీడియా సభ్యులు చేపల రాజు,కర్రి గణేష్,నానేపల్లి అప్పలరాజు, వీర్రాజు, బాబి ఉన్నారు.

రాత్రిపూట బస్టాపుల్లో బస్సుల్ని ఆపాలి



ఆర్టీసీ డిపో ట్రాఫిక్ మేనేజర్ రవిచంద్రకు వినతి పత్రం అందిస్తున్న కొణతాల వెంకటఅప్పారావు

అనకాపల్లిటౌన్ : అనకాపల్లి-విశాఖ రూట్‌లో తిరిగే 500 నంబర్ బస్‌లను బస్‌స్టాప్‌లలో ఆపి, ప్రయాణికులను ఎక్కించుకోవాలని గవరపాలేనికి చెందిన వ్యాపారవేత్త కొణతాల వెంకటఅప్పారావు కోరారు. ఈ మేరకు స్థానిక ట్రాఫిక్ మేనేజర్ రవీంద్రకు బుధవారం వినతిపత్రం అందించారు. వివిధ పనుల కోసం రోజూ వందల మంది అనకాపల్లి నుంచి విశాఖకు రాకపోకలు సాగిస్తున్నారని తెలిపారు. మంగళవారం రాత్రి విశాఖ ద్వారకా బస్‌స్టేషన్ వద్ద గంటపాటు నిరీక్షించినా ఒక్క బస్సూ రాలేదన్నారు. రాత్రి 9 గంటల సమయంలో ఒకేసారి మూడు బస్సులు వచ్చాయని, ప్రయాణికులున్నా.. ఆపకుండా వెళ్లిపోయారని ఆరోపించారు. విశాఖ నుంచి అనకాపల్లి వచ్చే బస్‌డ్రైవర్లకు బస్‌స్టాప్‌లో బస్‌లు ఆపి ప్రయాణీకులను ఎక్కించుకునేలా ఆదేశాలు జారీ చేయాలని తన వినతిపత్రంలో పేర్కొన్నారు.

ఓటడిగే హక్కు మనకే ఉంది

- పాయకరావుపేట ఎమ్మెల్యే బాబూరావు
- గృహ సారథులకు దశ దిశ నిర్దేశం



గృహసారథుల శిక్షణ కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే గొల్ల బాబూరావు

ఎస్.రాయవరం : ప్రతి ఇంటికి వెళ్లి ఓటు హక్కు అడిగే వైఎస్సార్ కాంగ్రెస్‌పార్టీ వారికే ఉంటుందని పాయకరావుపేట ఎమ్మెల్యే గొల్ల బాబూరావు అన్నారు. గోకులపాడు గ్రామంలో ఎస్.రాయవరం మండల కన్వీనర్లు, గృహ సారథులతో ఒక్కరోజు శిక్షణ నిర్వహించారు. మా నమ్మకం నువ్వే జగన్ అనే కార్యక్రమాన్ని ప్రజల్లోనికి విస్తృతంగా తీసుకువెళ్లాలని ఈ సందర్భంగా పలు గ్రామాల, సర్పంచ్‌లు, సీనియర్ నాయకులు ప్రభుత్వ పథకాలు అమలు తీరుపై కొనియాడారు. వలంటీర్లతో కలిసి ప్రతి ఇంటికి తిరిగాలన్నారు. అనంతరం ఎమ్మెల్యే గృహ సారథులకు దశ దిశా నిర్దేశించారు. గతంలో ఎన్నడూ లేని విధంగా ప్రభుత్వ సంక్షేమ పథకాలు ప్రతి ఇంటికి అందించిన ఘనత సీఎం జగన్ మోహన్‌రెడ్డిదే అన్నారు. గత ప్రభుత్వంలో జన్మభూమి కమిటీలు అవినీతికి, వివక్షకు పరాకాష్ట అన్నారు. చంద్రబాబు ఎస్సీల ద్రోహి అని, బీసీలకు తోకలు కత్తిరిస్తా.. అని చెప్పి ఇప్పుడు మాట మారుస్తున్నారన్నారు. బాబు హయాంలో పేదలకు సొంతింటి కల కలగానే మిగిలిపోయిందని అన్నారు. జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి అయిన తరువాత 30 లక్షల మందికి ఇంటి పట్టాలు, ఇళ్ల స్థలాలు ఇచ్చామన్నారు. అందులో 25 లక్షల మంది ఇళ్లు స్కీమ్‌లు ఇచ్చి సొంత ఇంటి కల నెరవేర్చారన్నారు. విద్య, వైద్య రంగాల్లో విప్లవాత్మక మార్పు జగనన్న తీసుకొచ్చారని అన్నారు. ఈ కార్యక్రమంలో పాయకరావుపేట నియోజకవర్గ పరిశీలకుడు చింతలపూడి వెంకటరామయ్య, ఎంపీపీ కోన లోవలక్ష్మి, జెడ్పీటీసీ కాకర దేవి, పెనుగొల్లు, ఎస్.రాయవరం కోఆపరేటివ్ బ్యాంకు చైర్‌పర్సన్‌లు దోసపాత్రుని హనుమంతరావు, అల్లాడ నాగరాజు, మత్స్యకార సంఘ జిల్లా అధ్యక్షుడు మాతా గురునాథరావు, సర్పంచ్‌లు మల్లే లోవరాజు, మైలపల్లి శ్రీనివాస్, దారబోయిన గణేష్, సీనియర్ నాయకులు పోలిశెట్టి పెద ఈశ్వరరావు, శ్రీపతిరాజు, నూకునాయుడు, మైలారు శ్రీనివాసరావు, సందీప్‌కుమార్, పోతురాజు, మణిరాజు పాల్గొన్నారు.

బోధన మెరుగుపడాలి



నారాయణపట్నం పాఠశాలలో విద్యార్థులను ప్రశ్నిస్తున్న డిప్యూటీ డీఈవో ప్రేమ్‌కుమార్

ఎస్.రాయవరం : ప్రభుత్వం ఆధునిక విద్యకు శ్రీకారం చుడుతూ 8 వ తరగతి విద్యార్థులకు అందజేసిన ట్యాబులను సక్రమంగా వినియోగించడం లేదని జిల్లా ఉప విద్యాశాఖాధికారి ప్రేమ్‌కుమార్ అన్నారు. తిమ్మాపురం కస్తూర్బావిద్యాలయం, నారాయణపట్నం ఉన్నత పాఠశాలను బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయుల పనితీరుపై ప్రశ్నల వర్షం కురిపించారు. 10 రోజులు సమయం ఇచ్చి తీరు మార్చుకోవాలని హెచ్చరించారు. విద్యార్థులను ప్రశ్నించి, సామర్థ్యాలను పరిశీలించారు. ఉపాధ్యాయులు బోధనలో తీవ్ర అలసత్వం కనిపిస్తోందని, బోధన తీరు మారకుంటే ఉపాధ్యాయులపై చర్యలు తప్పవని అన్నారు. ఈ పర్యటనలో ఎంఈవో మూర్తి పాల్గొన్నారు.

విద్యార్థుల అభ్యసనా స్థాయి పెంచాలి



నక్కపల్లి బాలికల పాఠశాలలలో లిప్ కార్యక్రమాన్ని పరిశీలిస్తున్న రాష్ట్ర బృందం

నక్కపల్లి : సమగ్ర శిక్ష అభియాన్ అమరావతి, ఎస్‌సీఆర్‌ఈటీ వారి ఆధ్వర్యంలో ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న లిప్(లెర్నింగ్ ఇంప్రూవ్‌మెంట్ ప్రోగ్రాం) అమలు తీరును పరిశీలించేందుకు ముగ్గురు సభ్యులు గల రాష్ట్ర బృందం బుధవారం నక్కపల్లి బాలికల ఉన్నత పాఠశాలను సందర్శించింది. ఈ బృందంలో సభ్యులైన డైట్ లెక్చరర్ జీజీఎస్ నాగేశ్వరరావు, నాగలక్ష్మి , డేవిడ్ రాజు మాట్లాడుతూ ఉపాధ్యాయులు టీచింగ్ పిరియడ్‌తోపాటు ప్రాక్టీస్ పిరియడ్‌ను కూడా నిర్వహిస్తే మంచి ఫలితాలు ఉంటాయన్నారు. ఈనెల 14నుంచి 16వ తేదీ వరకు మూడు రోజుల పాటు ప్రాథమిక, ప్రాథమికోన్నత, జడ్పీ ఉన్నత పాఠశాలల్లో లిప్ కార్యక్రమంపై పరిశీలన చేస్తున్నామన్నారు. విద్యార్థుల అభ్యసనా స్థాయిని పెంచేందుకు తీసుకోవాల్సిన చర్యలపై ఉపాధ్యాయులకు సూచనలు చేశారు. కార్యక్రమంలో తూర్పుగోదావరి జిల్లా నోడల్ అధికారి ఆర్.వి.గిరి, ఎంఈవో డీవీడీ ప్రసాద్ పాల్గొన్నారు.

గొడిచర్ల పీహెచ్‌సీకి ఈసీజీ మిషన్ వితరణ



ఆస్పత్రి వైద్యునికి ఈసీజీ మిషన్‌ను అందజేస్తున్న డీజీఎంలు సుబ్బారెడ్డి, కుళ్లాయిరెడ్డి

నక్కపల్లి : గొడిచర్ల ప్రాథమిక ఆరోగ్యకేంద్రానికి హెటిరో గ్రూప్ ఆఫ్ కంపెనీస్ యాజమాన్యం ఈసీజీ మిషన్‌ను విరాళంగా అందజేసింది. సుమారు లక్షరూపాయల విలువైన ఈ మిషన్‌ను కంపెనీ చైర్మన్ బండి పార్థసారథి విరాళంగా సమకూర్చినట్టు కంపెనీ డీజీఎంలు సుబ్బారెడ్డి, కుళ్లాయిరెడ్డి తెలిపారు. బుధవారం ఈ మిషన్‌ను వారు పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ కిషోర్‌కు అందజేశారు. డాక్టర్ కిషోర్ మాట్లాడుతూ మండలంలో సుమారు 20 మెరక గ్రామాల ప్రజలకు గొడిచర్ల పీహెచ్‌సీ ద్వారా వైద్య సేవలు అందుతున్నాయన్నారు. ఆస్పత్రికి ఈసీజి మిషన్‌ను విరాళంగా అందజేసిన హెటిరో చైర్మన్ పార్థసారధిరెడ్డికి కృతజ్ఞతలు తెలుపుతున్నామన్నారు. విద్యార్థులకు, ప్రజలకు అవసరమైన సదుపాయాల కల్పనకు తమ సంస్థ ఎండీ ఇతోధికంగా సాయం అందిస్తున్నారని సుబ్బారెడ్డి, కుళ్లాయిరెడ్డి తెలిపారు.

ఆక్రమణలపై రెవెన్యూ శాఖ ఉక్కుపాదం

- ఆటోలతో ప్రచారం చేస్తున్న రెవెన్యూ యంత్రాంగం



మారేడుపూడి సర్వే నెం.357లో ఏర్పాటు చేసిన హెచ్చరిక బోర్డు

అనకాపల్లిటౌన్ : మండలంలో మారేడుపూడి గ్రామం సర్వే నెం.357లో భూముల ఆక్రమణలు పెచ్చుమీరుతున్న సమయంలో రెవెన్యూ అధికారులు వరుసగా దాడులు నిర్వహిస్తూ ఉక్కుపాదం మోపుతున్నారు. ఒక పక్క ఆక్రమణలపై రెవెన్యూ అధికారులు దాడులు, మరో పక్క ప్రభుత్వ భూముల్లో హెచ్చరిక బోర్డులు పాతి అక్రమార్కులకు హెచ్చరికల జారీ చేస్తున్నారు. నిబంధనలను మీరి, ఇష్టారాజ్యంగా నిర్మాణాలు చేపడుతున్న వారిని హడలెత్తిస్తున్నారు. ఆక్రమణదారులు ప్రభుత్వ స్థలాలను ఆక్రమించినా, అన్యాక్రాంతం చేసినా అటువంటివారిపై ఐపీసీ 183, 189, 196 సెక్షన్ల ద్వారా కేసులు నమోదు చేస్తామంటూ ఆటో ద్వారా ప్రచారానికి తహసీల్దార్ గంగాధరరావు శ్రీకారం చుట్టారు. ఈ ఆటో మండలంలోని పలు గ్రామాల్లో తిరుగుతూ జనసంచారం ఎక్కువగా ఉన్న చోట ప్రచారం చేస్తోంది. ఈ విషయంపై తహసీల్దార్ గంగాధరరావు సాక్షితో మాట్లాడుతూ మండలంతోపాటు, పట్టణమంతా తమ సిబ్బందితో వారం రోజుల పాటు ప్రత్యేక డ్రైవ్ నిర్వహించనున్నట్టు వెల్లడించారు. ఈ డ్రైవ్‌లో ఎక్కడైనా ప్రభుత్వ భూమిలో ఆక్రమణలు కనిపిస్తే రెవెన్యూ చట్టం కింద కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

సరైన వేళల్లో పురుగు మందుల పిచికారీ

- వృధాను అరికడితే రైతుకు మరింత ఆదా



పంటకు పురుగు మందు పిచికారీ చేస్తున్న రైతు

అనకాపల్లి రూరల్ : వ్యవసాయ, ఉద్యాన పంటల్లో పురుగులు, తెగుళ్ల నివారణకు మందుల పిచికారీలో వేళలు కూడా ముఖ్యమేనని వ్యవసాయాధికారులు సూచిస్తున్నారు. ఏ పంటకైనా ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల్లోపు, సాయంత్రం 4 గంటల నుంచి 6 గంటల వరకు మాత్రమే రసాయన మందులు పిచికారీ చేయాలి. మిట్ట మధ్యాహ్నం వేళ మందులు పిచికారీ చేస్తే ఎక్కువ శాతం ఎండలకు ఆవిరి రూపంలో గాలిలో కలిసిపోయి పంటకు చేరదు. అలాగే సాయంత్రం 6 గంటల తర్వాత కూడా పిచికారీ చేయడం మంచిది కాదు. ఎండ తీవ్రత తక్కువగా ఉన్న సమయంలో గాలి వాటం చూసుకుని పురుగు మందు పిచికారీ చేస్తే పంటకు వినియోగమై మంచి ఫలితం ఉంటుంది. వరి, మిరప, నువ్వులు వంటి పంటలకు ఈ జాగ్రత్తలు తప్పనిసరిగా రైతులు పాటించాలని వ్యవసాయ, ఉద్యాన శాఖల అధికారులు సూచిస్తున్నారు. ఇలా చేయడం వలన పిచికారీ చేసిన మందు వృధాను అరికట్టడంతో పాటు కొంతమేర ఖర్చు ఆదా చేసినట్టేనని చెప్తున్నారు.

పురుగు మందు పిచికారీలో జాగ్రత్త



రైతులు పురుగు మందుల పిచికారీలో తప్పనిసరిగా తగు జాగ్రత్తలు పాటించాలి. సరైన మెలకువలు పాటిస్తే మందును, సాగు వ్యయాన్ని ఆదా చేయవచ్చు. రైతులకు ఏమైనా సందేహాలుంటే సమీపంలోని ఆర్‌బీకే సిబ్బందిని, లేదా వ్యవసాయాధికారులను సంప్రదించి నివృత్తి చేసుకోవొచ్చు. దీని వలన సాగులో మంచి ఫలితాలు సాధించవచ్చు.

– పీయూటీపీ రంగాచారి, వ్యవసాయాధికారి